
# 3

# ఈజిప్టు నాగరకత

"ఈజిప్టుకు నైలునది వరప్రసాద"మని హెరడోటస్ (Heriodutos)చక్కగా అనినాడు. అక్కడి నాగరికత నైలులోయలో వికసించింది. నైలులోయ పొడవు సుమారు 1200 కి. మీ. వెడల్పు చాల మేర 16 కి. మీ కొన్నిచోట్ల మాత్రము 49.6 కి. మీ. లోయ విస్తీర్ణము దాదాపు 2590000 హెక్టారులు (పటము 4). నైలు నదికి ప్రతి సంవత్సరమూ వరదవచ్చి దానితోపాటు వచ్చిన వండ్రు మట్టితో లోయ సారవంతం అయ్యేది. నైలునదికి వరద క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరమూ రావడంవల్ల ఈ లోయలో నివసించే ప్రజలు తగిన సమయంలోనే వరద ప్రమాదాలను ఎదుర్కోడానికి వీలు కలిగేది. ఆగష్టు 15, అక్టోబరు నెలల మధ్య, అంటే కిందటి పంట కోతలు పూర్తిఅయి కొత్త పంటకు విత్తనాలు చల్లే మధ్య కాలంలో వరద రావడంవల్ల పంటలకు దెబ్బ లేకపోవడమే కాక, కొత్త పంటకు కావలసిన సారము నేలలకు చేకూరేది. సంవత్సరంలో 9 నెలలు గాలులు ఉత్తర దిశనుంచి నైలు ప్రవాహానికి ఎదురుగా వీచడంవల్ల ప్రవాహపు ఉద్ధృతంతగ్గి పడవల రాకపోకలకు నది అనువుగా ఉండేది. ఈజిప్టు సమశీతోష్ణస్థితి కలిగిన దేశము. ప్రజలు ఈ శీతోష్ణస్థితిలో బాగా శ్రమించగలిగేవారు. ఈ విధంగా ఈజిప్టులో నాగరకత అభివృద్ధి చెందడానికి అక్కడి నైలునది, శీతోష్ణస్థితులు ప్రధానకారణాలయినాయి.

ఈజిప్టు ప్రాచీన చరిత్రను, రెండు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు. 1. ప్రిడైనాస్టిక్ యుగము (క్రీ.పూ. 5000 నుంచి క్రీ.పూ. 3200 వరకు) 2. ఫేరో (Pharaoh) ల పరిపాలనా యుగము. ఫేరోల పాలనను మరల 3 భాగాలుగా విభజించవచ్చు: 1. ప్రాచీన




దేశపటము 4. ప్రాచీన ఈజిప్టు

సామ్రాజ్యము (O!d Kingdom) క్రీ. పూ. 3200 నుంచి క్రీ. పూ. 2300 వరకు 2. మధ్య రాజ్యము (Middle Kingdon) క్రీ. పూ. 2100 నుంచి క్రీ. పూ. 1788 వరకు 3. నూతన సామ్రాజ్యము (New Empire) క్రీ. పూ. 1580 నుంచి క్రీ. పూ. 1090 వరకు.

## 1. 'ప్రీడైనాస్టిక్' యుగము

క్రీ. పూ. 5000 నుంచి క్రీ. పూ. 3200 వరకూ ఈజిప్టు చరిత్రను ప్రీడైనాస్టిక్ యుగము అంటారు. ఈజిప్టును భౌగోళికంగా డెల్టా ప్రాంతము, లోయ ప్రాంతము అని విభజించవచ్చు. డెల్టా ప్రాంతంలోని రాజ్యాన్ని ఉత్తర రాజ్యాలు లేదా దిగువ రాజ్యము అనీ, లోయ ప్రాంతంలోని రాజ్యాన్ని దక్షిణ రాజ్యం లేదా ఎగువ రాజ్యము అనీ అంటారు. క్రీ. పూ. 3200 లో రెండు రాజ్యాలూ ఏకం అయినాయి. ప్రాచీన ఈజిప్షియనులు మెడిటరేనియన్ జాతికి చెందినవారు. ఈజిప్టు ప్రాచీన నాగరకతకు పునాదులు ప్రీడైనాస్టిక్ యుగంలోనే వేయబడినాయి.

## 2. ఫేరోల పరిపాలనా యుగము

1. ప్రాచీన సామ్రాజ్యము : మీనీజ్ (Menes) రాజు క్రీ.పూ. 3200 లో ఉత్తర, దక్షిణ రాజ్యాలను ఏకంచేసి ప్రాచీన సామ్రాజ్యాన్ని స్థాపన చేసినాడు. ఈజిప్టును పరిపాలించిన 30 రాజవంశాలలో మొదటి వంశానికి మూల పురుషుడు మీనీజ్. 6 వంశాలు ప్రాచీన సామ్రాజ్యాన్ని పరిపాలించినాయి. మొదట్లో తినిస్ (Thinis) సామ్రాజ్యానికి రాజధానిగా ఉండేది. కాని మూడోవంశం రాజధానిని డెల్టా ప్రాంతంలోని మెమ్ఫిస్ (Memphis) నగరానికి మార్చింది. 500 సంవత్సరాలపాటు మెమ్ఫిస్ రాజధానిగా ఉంది. అందువల్లనే క్రీ. పూ. 2800 నుంచి 2300 చరిత్రను మెమ్ఫైట్ యుగమంటారు.

2. మధ్య రాజ్యము : ప్రాచీన సామ్రాజ్యం క్షీణించిన తరవాత కొంతకాలం వరకూ దేశంలో సంక్షోభ పరిస్థితులు ఏర్పడి

నాయి. కాని క్రీ. పూ. 2100 లో 11 వ రాజవంశము మధ్య రాజ్యాన్ని స్థాపించింది. 12 వ వంశము ఫేరోలు ప్రజలకు ప్రభుత్వంలో ప్రాతినిధ్యం ఇవ్వడంవల్ల, చరిత్రలో ప్రథమంగా ప్రజాస్వామ్య రాజ్య పద్ధతిని ప్రవేశపెట్టిన గౌరవము ఈజిప్టుకు దక్కింది. 12 వ రాజవంశము అంతరించిన తరవాత అనైక్యము ప్రబలి ఈజిప్టు దండయాత్రలకు గురిఅయింది.

3. నూతన సామ్రాజ్యము : అమోస్ (Ahmose) I 18 వ వంశానికి మూలపురుషుడు. ఇతడు నూతన సామ్రాజ్యాన్ని స్థాపించినాడు. ఇప్పటినుంచి ఈజిప్టు పరిపాలకులు రాజ్య విస్తరణ విధానాన్ని అవలంబించినారు. నూతన సామ్రాజ్యాన్ని పాలించినవారిలో రాణి హాట్‌షెప్‌సూట్ (Hatshepsut), తట్‌మోజ్ (Thutmose) III, ఇక్నాటన్ (Ikhnaton), రామెసీజ్ (Rameses) II, రామెసీజ్ III ముఖ్యులు.

ఈజిప్టు పతనము క్రీ. పూ. 10 వ శతాబ్దంలో ప్రారంభమైంది. క్రీ. పూ. 8 వ శతాబ్దం అంతంలో లిబియారాజులు దండెత్తివచ్చి ఈజిప్టు సింహాసనాన్ని ఆక్రమించినారు. వీరి తరవాత నైలు ఎగువ ప్రాంతంనుంచి వచ్చిన ఇతియోపియన్లు (Ethiopians) లేదా న్యూబియన్లు (Nubians) పాలించినారు. క్రీ. పూ. 670 నుంచి 8 సంవత్సరాలు అస్సీరియన్లు పాలించినారు. క్రీ. పూ. 622 లో ఈజిప్టు మరల స్వతంత్రమైంది. కాని క్రీ. పూ. 525 లో పర్షియా ఈజిప్టును జయించింది. అంతటితో ఈజిప్టు ప్రాచీన వైభవం అంతరించింది.

## ప్రాచీన ఈజిప్టులో రాజ్యాంగపద్ధతి

ఈజిప్టులో న్యాయశాసనాలను సాంఘిక కట్టుబాట్లను భగవంతుని శాసనంగా భావించేవారు. రాజు భగవంతుని ప్రతినిధి. అతనిని సూర్యదేవుని రూపమైన రి (Re) దేవుని పుత్రునిగా, దేవాంశ సంభూతునిగా భావించి 'ఫేరో' అని పిలిచేవారు. 'ఫేరో', 'ఉత్తమ గృహము' 'రాజ ప్రాసాదము' అనే అర్థాన్ని ఇచ్చే 'పెర్-ఒ' అనే

ఈజిప్షియన్ పదంనుంచి పుట్టింది. కాని భగవంతుని ఆదేశస్వరూపమైన ప్రాచీన న్యాయ నిబంధనలకు కట్టుబడే రాజు పరిపాలన చేయవలె. ఫేరోను, అతని ప్రధాన ఉద్యోగులను దేశానికి పురోహితులుగా భావించేవారు. అందరిలో ఫేరో ప్రధాన పురోహితుడు. ఫేరో పదవి పరంపరాగతము. యువరాజు తండ్రికింద ప్రధానమంత్రిగనో, ప్రధానోద్యోగిగానో శిక్షణపొందిన తరవాతే ఫేరో పదవిని చేపట్టే వాడు.

వజీర్ లేదా ప్రధానమంత్రి, కోశాధికారి, ప్రధాన న్యాయ మూర్తి ఫేరోకు రాజ్యపాలనలో తోడ్పడేవారు. రాజ్యాన్ని 42 నోమ్స్ (Nomes) లేదా జిల్లాలుగా భాగించి, ప్రతి నోమ్‌కు నోమార్క్ (Nomarch)ను నియమించినారు. మొదట్లో నోమార్క్కులను ఫేరో నియమించేవాడు. కాలక్రమేణా ఈ పదవి వారసత్వపు హక్కులా అయింది. దీనివల్ల నోమార్క్కులు బలవంతులై కేంద్ర ప్రభుత్వాన్నే ధిక్కరించడం ప్రారంభించినారు.

ఈజిప్టులో మొత్తము ఆరు న్యాయస్థానాలు ఉండేవి. న్యాయ శాస్త్రంలో ప్రావీణ్యమున్న ప్రభుత్వోద్యోగులు న్యాయ విచారణ తరచుగా చేసేవారు. ప్రధాన న్యాయాధిపతి, తక్కిన న్యాయాధి పతులు విచారణ చేసిన విషయాలను అవసరమైతే ఫేరో పునర్విచారణ చేసేవాడు.

మొదట్లో ఫేరోకి ప్రత్యేక సైన్యం ఉండేది కాదు. నోమ్ సేనలే అవసరమైనప్పుడు ఫేరోకి సహాయం చేసేవి. విశేషంగా సార వంతమైన భూములు ఉండడంవల్ల విదేశ దండయాత్రలలో ఈజిప్టు మొదట్లో ఆసక్తి కనబరచలేదు. కాని నూతన సామ్రాజ్యాన్ని పాలించిన రాజులు విదేశ దండయాత్ర, సామ్రాజ్య విస్తరణ విధానా లను అవలంబించడంతో రాజ్యాంగంలో కూడా మార్పులు వచ్చి నాయి. ఫేరో తన ప్రత్యేక సేనను ఏర్పరచుకొన్నాడు. అతడు దేశఐక్యము, ప్రజలఆదరాభిమానాలకన్నా సైనికబలంమీదఎక్కువగా ఆధారపడడం ప్రారంభించి, నియంత అయినాడు. రాజ్యాన్ని

50 పరిపాలనా భాగాలుగా విభజించి తన ప్రతినిధులను వాటికి కౌంట్స్ లేదా గవర్నర్లుగా నియోగించినాడు. తన జ్యేష్ఠపుత్రుని సర్వసేనానిగా నియమించినాడు.

## సాంఘిక, ఆర్థిక జీవనము

సంఘంలో ఆర్థిక వ్యత్యాసాలు, తారతమ్యాలు ఉన్నప్పటికీ నిర్ణీత కులాలంటూ లేవు. రాజకుటుంబీకులను మాత్రము ప్రత్యేక తరగతిగ పరిగణించేవారు. తక్కిన తరగతులవారిని పరిస్థితులనుబట్టి ఒక తరగతినుంచి మరొక తరగతికి చేర్చేవారు. ఈజిప్టులో సంఘాన్ని 7 తరగతులుగా భాగించవచ్చు:

1. రాజకుటుంబీకులు 2. మతాధికారులు 3. కులీనులు (Nobles) 4. మధ్యతరగతికి చెందిన వర్తకులు, రైతులు మొదలైనవారు 5. కృషిక దాసులు (Serfs) 6. సైనికులు 7. బానిసలు.

ధనికుల జీవనానికీ, బీదల జీవనానికీ అత్యంత తారతమ్యం ఉండేది. ధనికులు అష్టైశ్వర్యాలతో తులతూగుతుంటే బీదలు నికృష్ట జీవనం గడిపేవారు.

ఈజిప్టు సంఘానికి ఆలంబనం కుటుంబవ్యవస్థ. సంఘంలో ఎవరూ ఒక భార్యనుమించి కలిగియుండకూడదు. ఫేరోకూడ ఈ నిబంధనకు లోబడిఉండేవాడు. వేశ్యావృత్తిని ఈజిప్షియనులు గౌరవప్రదంగా పరిగణించేవారు. సంఘంలో స్త్రీలు ప్రధానస్థానాన్ని అలంకరించినారు. వారు సింహాసనాన్ని అధిష్ఠించడానికి అర్హులు. రాజవంశీయుల రక్తం కలుషితం కాకుండటానికి ఫేరో తన సోదరినో లేదా తన కుటుంబంలో దగ్గరవారినో వివాహం చేసుకొనేవాడు. ఈ పద్ధతిని ప్రజలుకూడా అనుసరించేవారు.

ప్రాచీన ఈజిప్టులో విద్యాబోధనాలయాలు ముఖ్యంగా రాజ్య పాలన, వ్యాపార వ్యవహారాలకు అవసరమైన లేఖకులకు తర్ఫీదు

నిచ్చేవి. పాఠశాలలలో చేర్చుకోడానికి వర్గవిభేదాలు అడ్డు వచ్చేవి కావు. పాఠ్యాంశాలలో నిత్యోపయోగమైన అంశాలనే చేర్చేవారు. విద్యాబోధన ఉచితము. వ్యవహారోచిత విద్యలను నేర్పడమే (Practical Training) ప్రాచీన ఈజిప్టు విద్యాబోధన లక్ష్యం.


ఆర్థికవ్యవస్థ వ్యవసాయంపై ఆధారపడి ఉండేది. గోధుమలు, బార్లీ, కాయగూరలు, ఫలాలు, పత్తి ప్రాచీన ఈజిప్టులో ముఖ్య పంటలు. క్రీ. పూ. 2000 తరవాత క్రీట్, ఫీనీషియా, పాలస్తీన్, సిరియా దేశాలతో వ్యాపారం వృద్ధిచెందింది. గోధుమలు, లినన్ బట్టలు, మృణ్మయ పాత్రలు, ఈజిప్టు ముఖ్యంగా ఎగుమతి చేసేది. బంగారం, వెండి, దంతము ముఖ్య దిగుమతులు.

నౌకా నిర్మాణము, వస్త్రాలను, అద్దాలను, మృణ్మయపాత్రలను తయారుచేయడం నాటి ఈజిప్టు ముఖ్య పరిశ్రమలు. గణాంకము, రసీదులవంటి వాణిజ్య పద్ధతులను ఈజిప్షనులు వాడినారు. పిరమిడ్‌లు దేవాలయాలవంటి భారీ నిర్మాణకార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టడం



చిత్రపటము 8.

ఈజిప్టు, క్రీ. పూ. 2700 నాటి షేక్‌సైద్ వద్దనున్న కుడ్యచిత్రాల నుంచి వ్యవసాయ విధానము.




చిత్రపటము 9.

ఈజిప్టు, క్రీ పూ. 1500 నాటి తబ్జ్‌వద్దనున్న కుడ్యచిత్రాలనుంచి, ఇటుకలు చేసే పద్ధతి, రాతిపని

వల్ల ఆర్థిక వ్యవస్థ అధికంగా ప్రభుత్వ కార్యక్రమాలపై ఆధారపడి ఉండేది (చిత్రపటాలు 8, 9).

## మత పరిస్థితులు

ప్రాచీన ఈజిప్టులో మతము ప్రధానస్థానాన్ని ఆక్రమించింది. ఈజిప్టు రాజ్యాంగవిధానమే భగవంతుని సర్వాధికారిగా భావించే రాజ్యవ్యవస్థ (Theocracy). ర, అమోన్ అనేపేర్లతో సూర్యుడూ, ఓసైరిస్ (Osiris) ఈజిప్షియనులకు ప్రధాన ఆరాధ్య దేవతలు. 'ర' దేశానికి, దేశ ప్రజలకు స్థైర్యాన్ని ప్రసాదిస్తాడని వారు నమ్మేవారు. ఫారో దేహాన్ని మమ్మిఫై (Mummify) చేసి సమాధిలో భద్రపరచడంవల్ల దేశానికి శాశ్వతంగా సంరక్షణ చేకూరుతుందని అనుకొనేవారు. న్యాయము, సత్యము, నైతిక విషయాలకుకూడా 'ర' అధిదేవత అని వారి విశ్వాసము. అతడు రాజ్యం మొత్తాన్ని రక్షిస్తాడే గాని ప్రతివ్యక్తికీ ప్రత్యేకరక్షణ ఇవ్వలేదు. ఓసైరిస్ వారి ప్రకృతి



చిత్రపటము 10.

ఈజిప్టు, పెపైరస్ చిత్రము. 21 వ రాజవంశానికి చెందిన ఒక రాజకుమారి హృదయాన్ని ఓసైరిస్ దేవుని ఎదుట తూచడం, త్రాసుప్రక్కగా జీవిత సత్యాల ప్రతిరూపాలు చిత్రించబడి ఉన్నాయి.

4406



దేవత. నైలునది శక్తులు ఈ దేవతనుంచి ఉత్పన్నమైనవని వారి భావము. ఈ దేవతనుగూర్చి అనేక పురాణగాథలు ఉన్నాయి. ప్రజలకు వ్యవసాయము మొదలైన జీవన విధానాలను నేర్పిన ఉదార ప్రభువు ఓసైరిస్. అతని సోదరుడు సెట్ (Set) ద్రోహి. ఓసైరిస్‌ను అతడు చంపి దేహాన్ని ముక్కలుచేసి పారవేసినాడు. ఓసైరిస్ భార్య ఈసిస్ (Isis) అతనిని మరల బ్రతికించింది. తరవాత ఓసైరిస్ కొంత కాలము రాజ్యాన్ని పాలించి పాతాళలోకం చేరినాడు. మరణించిన మానవుల పాపపుణ్యాలను విచారించే దేవతగా అయినాడు. ఓసైరిస్ పూర్వగాథ, అతని శక్తులు, అతనిని ప్రజల ఆరాధ్య దేవతను చేసినాయి (చిత్రపటము 10).

మధ్యరాజ్యకాలంలో ఈజిప్షియనులు దేహానికి 'క' (Ka) లేదా రెండవశరీరంతో బాటు 'బ' (Ba) అంటే ఆత్మకూడ ఉందని నమ్మకం ప్రారంభించినారు. వ్యక్తి మరణించిన తరవాత 'క', 'బ' పక్షి ఆకృతితో దూర ప్రదేశాలకు ప్రయాణంచేసి తిరిగివస్తాయని అనుకొనే వారు. అప్పటికి మృతదేహము భద్రంగా ఉంటే మరణించిన వ్యక్తి పునర్జీవుడు అవుతాడని వారి నమ్మకము. ఈ నమ్మికవల్లనే ఈజిప్షియనులు మృతదేహాలను మమ్మిఫై చేసేవారు. నూతన సామ్రాజ్య కాలంలో ఓసైరిస్, 'ర' దేవతలను సమానంగా ఆరాధించేవారు. ఈ కాలంలో మత విషయాలలో మూఢ విశ్వాసాలు పెరగడంతో మతాధికారులు తమ అధికారాలను పెంపు చేసుకొని దుర్వినియోగం చేయడం ప్రారంభించినారు (సుమారు క్రీ. పూ. 1375). ఈ పరిస్థితిని చక్కజేయడానికి ఫేరో అమెన్‌హాటెప్ (Amenhotip IV) మత సంస్కరణాలు ప్రవేశపెట్టినాడు. ఇతడు మతాధికారులను ఆలయాల నుంచి బహిష్కరించి, అందరు 'అటన్' (Aton) అనే సూర్యదేవుని ఆరాధించవలెనని శాసించినాడు. తన పేరును ఇక్నాటన్ (Ikhnaton) అంటే 'సంతృప్తుడైన అటన్' అనే అర్థాన్ని ఇచ్చేటట్లు మార్చుకొన్నాడు. అతడు ప్రచారంచేసిన ముఖ్య సిద్ధాంతాలలో అటన్ ఒకడే యావత్ప్రపంచానికీ దేవుడనీ, సృష్టికర్త, లయకారుడు అతడేనని ప్రచారం చేసినాడు. అతడే దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడు.

కాని, ఇక్నాటన్ తరవాత అతని సిద్ధాంతాలను ఎవరూ పాటించలేదు. మూఢ విశ్వాసాలు మరల ప్రబలినాయి. కొందరుమాత్రం అటన్ (Aton) బదులు అమన్-రి (Ammon-Re) దేవుని పూజించినారు. క్రమంగా ప్రజలు మంత్ర, తంత్రాలను ఎక్కువగా నమ్మడం ప్రారంభించినారు. ఇప్పటినుంచి ఈజిప్టు మత సంస్కృతులు క్షీణించినాయి.

## శాస్త్ర విజ్ఞానము

ఖగోళము, గణిత శాస్త్రాలలో ఈజిప్షియనులు మంచి నిపుణులు. వీరు ఈ శాస్త్రాలను నైలునది వరదలకు సంబంధించిన విషయాలను నిర్ణయించడానికీ, పిరమిడ్‌లు, దేవాలయాలు నిర్మించడానికి కావలసిన ప్లానులను తయారుచేయడానికీ, నీటి పారుదల వసతులను కల్పించడానికీ వినియోగించినారు. వీరు సూర్యసిద్ధాంతాన్ని (Solar Calendar) తయారు చేసినారు. ఈజిప్షియనులు వీటన్నిటిని ప్రీడైనాస్టిక్ యుగంలోనే సాధించినారు. తరవాత అంకవిద్యాగణితాన్నీ (Arithmetic), రేఖాగణితాన్నీ (Geometry) వృద్ధిచేసినారు. వైద్య శాస్త్రంలోకూడా ఈజిప్షియనులు గొప్ప ప్రగతిని సంపాదించినారు. శాస్త్రీయంగా రోగాన్ని నిర్ణయించడం, దానికి తగిన చికిత్స చేయడం కనిపెట్టినారు. ప్రాచీన ఈజిప్టులో నేత్ర, దంత, ఉదర వ్యాధులను నయం చేయడానికీ, శస్త్ర చికిత్సకూ ప్రత్యేక నిపుణులు ఉండేవారు. వీరు వైద్యవిధానంలో గుండెకూ, నాడికీ ఉన్న ప్రాముఖ్యాన్ని గుర్తించినారు. ఈజిప్టునుంచి వైద్య విధానం గ్రీకుల ద్వారా ఐరోపా ఖండాన్ని చేరడం జరిగింది. ఈజిప్షియనులు సూర్యఘటి (Sun-Dial), కాగితము, గాజు (Glass) తయారుచేయడాన్ని కనిపెట్టినారు. వీరు కనిపెట్టిన వ్రాత పద్ధతికి హీరోగ్లిఫిక్ (Hieroglyphic) అని పేరు. మొదట వీరు వస్తువులను చిత్రసంజ్ఞల (Pictographic Signs) ద్వారా తెలిపినారు. క్రమంగా సంజ్ఞల సంఖ్య 24 అయింది. హీరోగ్లిఫిక్ వ్రాత పద్ధతిలో చిత్రసంజ్ఞలు, అక్షర సంజ్ఞలు, వర్ణమాల విధానాలు మిశ్రితమైనాయి. వీరు హీరోగ్లిఫిక్‌తో హీరాటిక్ (Hieratic), డిమోటిక్ (Demotic) వ్రాత విధానాలను

వాడినారు. అధికంగా వేదాంతము, మత విషయాలగురించినది ఈజిప్టు సాహిత్యము. మెమ్ఫైట్ (Memphite) డ్రామా, రాయల్ సన్‌హిమ్ (Royal Sun Hymn) ఈ సాహిత్యంలో అతి ముఖ్యమైన రచనలు. ఈజిప్టులో జానపద సాహిత్యంకూడా బాగా వృద్ధిచెందింది.

## కళలు

ఈజిప్టు పిరమిడ్‌లకు ప్రసిద్ధము. ఇవి ప్రపంచ అద్భుతాలలో ఒకటి. గీజాలోని ప్రఖ్యాతమైన ఖూఫూ (Khufu) పిరమిడ్‌ను కట్ట డానికి లక్షమంది పనివారు 20 సంవత్సరాలకుపైన శ్రమించి ఉండాలని గ్రీకు చరిత్రకారుడు హెరొడొటస్ అంచనా వేసినాడు. ఈ పిరమిడ్ ఎత్తు 480 అడుగులు. దీనిని 20,000 సున్నపు రాళ్ళతో కట్టినారు. ప్రతి రాయి బరువు $2\frac{1}{2}$ టన్నులు. పిరమిడ్లను కట్టడానికి మతకారణాలేకాక రాజకీయ, ఆర్థిక కారణాలుకూడా ఉంటాయని నేటి చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. మధ్య రాజ్య కాలంలో పిరమిడ్‌ల బదులు ఈజిప్షియనులు ఆలయాలను నిర్మించినారు. ఇందులో ముఖ్యమైనవి కార్నక్ (Karnak), లక్సర్ (Luxor) ల వద్ద నూతన సామ్రాజ్యకాలంలో కట్టినవి. కార్నక్ దేవాలయం పొడవు 1300 అడుగులు. దేవాలయంలో అన్నిటికన్న పెద్ద స్తంభం ఎత్తు 70 అడుగులు, వ్యాసం 20 అడుగులు. స్తంభ ఫలకంమీద (Capital) వంద మనుషులు నిలిచేటంత వైశాల్యం ఉంది. 75 నుంచి 90 అడుగుల ఎత్తు ఉన్న ఫేరోల శిలా ప్రతిమలు ఈజిప్టు శిల్పకళ నైపుణ్యానికి ప్రధాన తార్కాణాలు. ఫీనిక్స్ (Phoenix) శిల్పము ఈజిప్టు ప్రత్యేకత. ఈ శిల్పం ఫేరో శిరస్సు, సింహం యొక్క దేహం కలసిన రూపం కలది. శిల్పాలు సహజంగా కనిపించ డానికి వాటికి రంగులు వేసేవారు. శిలా విగ్రహాల కళ్ళలో స్ఫటికా లను అమర్చేవారు. ప్రాచీన ఈజిప్టులో చిత్రకళకూడా వృద్ధిచెందిం దనడానికి నిదర్శనాలు ఉన్నాయి.